క్లుప్తంగా

అలంపూర్‌లో మాజీ ఎమ్మెల్యే పూజలు



అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకొన్నారు. బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు.

క్రికెట్ లీగ్ ప్రారంభం



రాజోళి: మండలంలోని పచ్చర్లలో విజయదశమి సందర్భంగా పచ్చర్ల ప్రీమియర్ లీగ్ సీజన్–3 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనువాసులు, కుమార్‌రెడ్డి పోటీలు ప్రాంభించారు. శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఉపకరిస్తాయని నాయకులు అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కుమార్, యువరాజు, దానియేలు, సంధ్యకుమార్, మురళి, అచ్యుత్‌రెడ్డి, ఆశీర్వాదం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు దసరా కానుక

అలంపూర్: జిల్లాలోని హమాలీలకు దసరా కానుకలు అందించినట్లు హమాలీ యూనియన్ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో దసరా పండగను పురస్కరించుకొని జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ విమల జిల్లాలోని హమాలీలకు దసరా కానుక అందజేశారన్నారు. బోనస్, 2 జతల యూనిఫాం, స్వీట్‌బాక్సలు అందజేశారు. కార్యక్రమంలో అకౌంటెంట్ నరేంద్ర, హమాలీలు పెద్దమద్దిలేటి, భూపాల్, సాయిబాబా, విశ్వనాథం, ఖాజా, కన్నయ్య, సునీల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మానవపాడు: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనన్నారు. మైనర్లు వాహనాలు నడపొద్దన్నారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన దీపం వెలిగించాలి



అయిజ: గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఏకల్ విద్యాలయాలు జ్ఞానదీపం వెలిగించాలని సంచ్ ప్రెసిడెంట్ భగత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఏకల్ అభియాన్ మాస వర్గ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి విద్య చాలా ప్రధానమైందన్నారు. పల్లెల్లో ప్రభుత్వ పాఠశాలలు సక్రమంగా పని చేయని సందర్భాల్లో పిల్లలకు ప్రాథమిక విద్య అందించడంలో ఏకల్ విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంచ్ ప్రముఖ్ రంగనాథ్, సంచ్ సాదక్ సోమేశ్వరమ్మ, మాతలు, ఆచార్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ధరూరు: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యం పెంపొందుతుందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమీర్ ముజాహిద్ అన్నారు. దసరాను పురస్కరించుకొని మండల పరిధిలోని ఉప్పేరులో ఆదివారం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

గట్టు: మండల పరిధిలోని బల్గెర గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వడ్డె నాగప్పకు చెందిన గుడిసె దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ బాసుశ్యామల ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నిత్యావసర సరుకులతో పాటుగా ఆర్థిక సాయం అందజేశారు.

పక్కాగా సాగు వివరాలు



గంగన్‌పల్లి శివారులో పంటల వివరాలు పరిశీలిస్తున్న ఏఓ రాజవర్ధన్‌రెడ్డి(ఫైల్)



పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ జ్యోతి

- క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన
- డిజిటల్ క్రాప్ సర్వేతో లబ్ధి
- రైతులకు చేకూరనున్న ప్రయోజనాలు

కేటీదొడ్డి: పంటల సాగు లెక్క పక్కాగా ఉండేలా ఖరీఫ్‌లో మండలంలో రైతులు సాగు చేసిన పంట వివరాల సేకరణలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు అక్టోబర్ 25 వరకు సర్వే నిర్వహించనున్నారు.

23 పంచాయతీలు..7 క్లస్టర్లలో

మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు 7 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్ కింద ఐదు నుంచి ఆరు గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ 7 క్లస్టర్లలో ఏడుగురు వ్యవసాయ విస్తరణ అధికారులు పంటలను పరిశీలించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

ప్రత్యేక యాప్‌లో

గత ప్రభుత్వం తొలుత పంటల సాగు విస్తీర్ణ వివరాలు సేకరించి ఆ తర్వాత ట్యాబ్‌లలో నమోదు చేసేవారు. ఈ సారి అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో ఏఈఓలు పంటల విస్తీర్ణాన్ని పరిశీలించిన తర్వాతే ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు.

పూర్తి వివరాల సేకరణ

క్రాప్ బుకింగ్ ప్రక్రియలో రైతు పేరు, సర్వే నంబర్, బ్యాంక్ ఖాతా నంబర్, పట్టాదారు పాసుబుక్ ఫోన్ నంబర్‌తో పాటు ఏఏ పంటలు ఎంత మేర సాగు చేశారనే వివరాలను రికార్డు చేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చేపడుతున్నారు. పక్కాగా లెక్కల వివరాలు ఉండేలా పారదర్శకంగా చేపడుతున్నారు. మండలంలోని సుమారు 23,135 వేల ఎకరాల్లో వరి 13,120, పత్తి, 7,215, వేరుశనగ 2,050, కంది 750 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు అధికారులు వివరాలు నమోదు చేశారు.

సర్వేతో రైతులకు మేలు



సీజన్‌లో భాగంగా సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసేందుకు డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తున్నాం. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏఈఓలు క్రాప్ బుకింగ్ సర్వే చేస్తున్నారు. దీంతో రైతులకు మేలు చేకూరనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సత్వరమే సర్వే పూర్తి చేస్తాం. అభ్యంతరాలుంటే రైతులు దరఖాస్తు అందజేస్తే విచారించి సరి చేసే అవకాశం ఉంది.రైతులు అందరూ ఈ సర్వేలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఏఓ రాజవర్ధన్ రెడ్డి, కేటీదొడ్డి

ఎస్‌ఎంఎస్ ద్వారా వివరాలు

క్లస్టర్లలో సాగవుతున్న పంటల నమోదు (క్రాప్ బుకింగ్) చేశాక రైతులకు ఎస్‌ఎంఎస్ ద్వారా వివరాలు పంపిస్తున్నారు. వరి నమోదు చేస్తున్నప్పుడు అందులో రకాలు తప్పనిసరిగా నమోదు చేస్తారు. అక్టోబర్ 25 నాటికి బుకింగ్ పూర్తి చేసి 27వ తేదీన గ్రామ పంచాయతీల్లో వివరాలు ప్రదర్శించాల్సి ఉంటుంది. అందులో తప్పులుంటే నవంబర్ 1 వరకు దరఖాస్తులు స్వీకరించి సరి చేశాక తుది జాబితాను నవంబర్ 5న ప్రదర్శించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

గ్రూప్–2లో సత్తా చాటారు



సుల్తాన్‌పురం బస్వరాజు



బల్గెర ఆంజనేయులు



అశోక్ తొత్తినోనిదొడ్డి



బాలరాజు అయిజ



రాజశేఖర్ రెడ్డి

గట్టు: ఉమ్మడి గట్టు మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఆదివారం వెలువడిన గ్రూప్– 2 ఫలితాల్లో సత్తా చాటారు. బల్గెరకు చెందిన ఆంజనేయులు ప్రస్తుతం గద్వాల ఎస్సీ– బీ హాస్టల్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూప్–2లో కో ఆపరేటివ్ సొసైటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కేటిదొడ్డి మండలం సుల్తాన్‌పురానికి చెందిన బస్వరాజు గట్టులోని ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తూనే ఎంపీఓ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

ఎక్సైజ్ ఎస్‌ఐగా కోయిల్‌దిన్నె యువకుడు

శాంతినగర్: ఆదివారం వెలువడిన గ్రూప్–2 ఫలితాల్లో కోయిల్‌దిన్నెకు చెందిన రాజశేఖర్‌రెడ్డి ఎక్సైజ్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు.

ఎంపీఓ, డీటీగా ఎంపిక

అయిజ: గ్రూప్– 2 ఫలితాల్లో మండలంలోని ఇద్దరు వ్యక్తులు ఉద్యోగాలు సాధించారు. తొత్తినోనిదొడ్డికి చెందిన అశోక్ డిప్యూటీ తహసీల్దార్‌గా, మండల కేంద్రానికి చెందిన బాలరాజు ఎంపీఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

భవన నిర్మాణానికి సాయమందించాలి



ఎర్రవల్లిలో ఎంపీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

అలంపూర్: అలంపూర్ క్షేత్ర దర్శనానికి విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు మండలంలోని లింగనవాయికి చెందిన యాదవ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో యాదవ సంఘం భవన నిర్మాణం కోసం రూ. 10 లక్షల సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అడ్డాకుల రాము, వేముల శ్యామ్, రవి, యాదవ సంఘం నాయకులు తదితతరులు పాల్గొన్నారు.

ఎంపీకి ఘన స్వాగతం

ఎర్రవల్లి: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి వెళ్తున్న ఎంపీ మందాడి అనిల్‌కుమార్‌యాదవ్‌ను కాంగ్రెస్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, జోగుల రవి ఎర్రవల్లి కూడలిలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జోగుల సరస్వతి, మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ నగర కమిటీ నియామకం



గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలో విశ్వ హిందూ పరిషత్ గద్వాల నగర నూతన కమిటీని ఆదివారం జిల్లా అధ్యక్షుడు అల్లూరి ఫణిమోహన్ రావు సమక్షంలో ప్రకటించారు. నగర అధ్యక్షుడిగా ముత్యాల నాగరాజు, ఉపాధ్యాక్షులుగా గోసాయి వేణు, చంద్రశేఖర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుర్రాల పరశురామ్, సహ కార్యదర్శిగా భీమహరికృష్ణ, శ్రీనివాసులు, దేవుజ నాయక్, పాగుంట నరేష్‌బాబు, నగర సత్సంగ్ ప్రముఖ్‌గా బ్రహ్మేశ్వర్‌రెడ్డిని నియమించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, శ్రీకాంత్‌రెడ్డి, భజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ తిరుపతి, మణి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బతుకమ్మ సంబరాలు



ఉండవెల్లి: మండలంలోని మారమునగాల–2లో ఛత్రపతి శివాజీ మహరాజ్ యువత ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మను పేర్చి, ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేశారు. సీనియర్ నాయకుడు పోతురాజు సోమనాద్రి గ్రామానికి చెందిన గొల్ల పెద్ద లక్ష్మన్నకు రూ.29వేలు, ముష్టి బుచ్చన్నకు రూ.32,500 విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బీచుపల్లి, వెంకటేష్, సవరన్న, జాకీర్, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘనంగా నివాళి



అయిజలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



గద్వాలలో భగత్‌సింగ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

గద్వాలటౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు, విప్లవకారుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఆదివారం సీపీఐ, సీపీఎం పార్టీలతో పాటు పలు విద్యార్థి సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కూరగాయల మార్కెట్ చౌరస్తాలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు నివాళులర్పించారు. సీపీఎం కార్యాలయంలో నాయకుడు ఉప్పేర్ నర్సింహ పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ స్ఫూర్తితో నవ సమాజ నిర్మాణానికి యువత నిరంతర పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

అయిజ: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు భగత్‌సింగ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళి

శాంతినగర్: భగత్‌సింగ్ జయంతి వేడుకలను మండలంలోని జూలెకల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



సాతర్లలో కరపత్రాలను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

ఇటిక్యాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికి తెలియజేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దులా అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాతర్లలో పార్టీ నాయకులతో కలిసి ప్రధాని మోదీ మన్‌కీబాత్ కార్యక్రమం వీక్షించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను విడుదల చేశారు. ప్రతి ఇంటికి కరపత్రాలు అందించి స్థానిక సంస్థల పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కాశన్న, పరమేష్, వీరేష్, నవీన్, మహేష్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమానత్వాన్ని చాటిన మహాకవి జాషువా



అలంపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

అలంపూర్: అసమానతలు లేని సమాజ నిర్మాణమే గుర్రం జాషువా లక్ష్యమని కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, సమ సమాజ సేవా ట్రస్టు డైరెక్టర్ వెంకట్రామయ్యశెట్టి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జాషువా జయంతిని నిర్వహించారు. సామాజిక సాహిత్య రంగంలో జాషువా కవిత్వం ఓ చైతన్య స్ఫూర్తిని రగిలించిందన్నారు. కర్మ సిద్ధాంతం పేరిట కష్టజీవులను అణిచివేత దోపిడీకి గురిచేసిన మనువాద విష సంస్కృతిపై మహోద్యమం నిర్మించాడన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు మద్దిలేటి, అడ్వకేట్ మధు నరసింహ్మ, గంగన్న, జయన్న తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం చాటడానికి కృషి

రాజోళి: మహాకవిగా గుర్రం జాషువా సమాజంలో సమానత్వాన్ని చాటడానికి ఎంతో కృషి చేశారని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో జాషువా జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దస్తగిరి, షాషావలి, రషీద్ తదిదరులు పాల్గొన్నారు.

పానీపూరి బండి నిర్వాహకుడిపై దాడి

గద్వాల క్రైం: పానీపూరి బండి నిర్వాహకుడిపై ముగ్గురు యువకులు మద్యం మత్తులో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. మధ్యప్రదేశ్‌కు చెందిన మంగిళ్ అనే యువకుడు న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని ప్రధాన రోడ్డు మార్గంలో పానీపూరి బండి ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాడు. అయితే ఆదివారం రాత్రి గద్వాలకు చెందిన ముగ్గురు యువకులు మద్యం మత్తులో పానీపూరి తినేందుకు వెళ్లారు. ఈక్రమంలో మాటామాటా పెరిగి పానీపూరి నిర్వాహకుడితో ఘర్షణపడ్డారు. ముగ్గురు యువకులు కలిసి అతడిని తీవ్రంగా గాయపర్చారు. స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బండిని సైతం ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మల్దకల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి భాస్కర్ సూచించారు. ఆదివారం అమరవాయి, బూడిదపాడు గ్రామాల్లోని వివిధ కాలనీల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షాలేం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ధరూరు: మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చిలో ఆదివారం కోతకాల పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సంఘ కాపరి రవికుమార్ వాక్య సందేశం చేశారు. ప్రతి ఏటా పంట చేతికొచ్చే సమయంలో క్రైస్తవులు నిర్వహించుకునే ఈ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలన్నారు.ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

గర్భిణులకు పండ్ల పంపిణీ

ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరబాబు, శేషు, లక్కీ, రవీంద్రబాబు, మధు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

ధరూరు: వాహన తనిఖీల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని చింతరేవులలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. మక్తల్, నారాయణపేట, డ్యాం వెళ్లే రోడ్డులో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

శాంతినగర్: ఫ్రెండ్స్ ఆఫ్ ట్రైబల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆచార్య, మాతాజీలకు మెటీరియల్ అందజేశారు. స్థానిక ఆదినారాయణస్వామి ఆశ్రమంలో జనహిత మాస వర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవపాడు ఏకల్ విద్యాలయ పాఠశాలలో పనిచేస్తున్న ఆచార్య, మాతాజీలకు మెటీరియల్, బ్లాక్ బోర్డులు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సంచ్ అధ్యక్షుడు గాయత్రి శ్రీనివాసులు, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం వెంకటేశ్వర్లు, రవీంద్రాచార్య, సంచు ప్రముఖ్ పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఆదుకోనుమా.. జగన్మాత



అయిజలో కాత్యాయనీ దేవిగా..



ధరూరులో అమ్మవారి దర్శనం



బీచుపల్లిలో అన్నపూర్ణాదేవి అలంకరణలో..



మల్దకల్‌లో లలితా త్రిపుర సుందరిదేవిగా..



మానవపాడులో శాకంబరీదేవి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో కనకదుర్గా, లలితా త్రిపుర సుందరిదేవిగా, మహా చండిగా, తనయాదేవి, కాత్యాయనిగా అలంకరణలు చేసి పూజలు చేశారు. పలు ఆలయాలు, మండపాల వద్ద ప్రత్యేక భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన క్రతువులు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.